గండిపేటలో పూజలు చేసిన చైర్‌పర్సన్


చెరువును పరిశీలిస్తున్న నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు

మణికొండ: గండిపేట చెరువు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుని గేట్లు తెరవాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. మంగళవారం జలమండలి ట్రాన్స్‌మిషన్ డీజీఎం నరహరితో కలిసి ఆమె జలశయాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెరువులోకి వచ్చి చెత్తను తొలగించే పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరింత వర్షం కురిసి గండిపేట, హిమాయత్ సాగర్, మంజీరా నదులు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోవాలన్నారు. రాబోయే వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి నీటి బాధలు లేకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు శివారెడ్డి, దుర్గేష్ యాదవ్, నాయకులు గోపాల గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు చేరుతున్న వినాయకులు


మండపానికి వచ్చిన గణపతికి స్వాగతం పలుకుతున్న యువకులు

మణికొండ: ఈనెల 7న వినాయక చవితి ఉండటంతో పండగను ఘనంగా నిర్వహించుకునేందుకు ఇప్పటికే ఉత్సవ కమిటీ నాయకులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రులు వినాయకుడిని మండపాలలో నెలకొల్పి పూజలు చేసేందుకు వారంతా సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలలో మండపాలను సిద్ధం చేస్తున్నారు. వినాయక చవితి ప్రత్యేక ఆకర్షణ అయిన వినాయక ప్రతిమలను నగరంలోని పలు ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి మండపాలకు తరలిస్తున్నారు. పెద్ద విగ్రహాలను ప్రతిష్ఠించే చోట ముందుగా మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఇప్పటికే వినాయక చవితి చందాలను వసూలు చేస్తున్నారు. ఉత్సవాలను ఘనంగా పోటా పోటీగా నిర్వహించేందుకు పలు మండలాలు, నిర్వాహకులు సిద్ధం అయ్యారు.

ఎయిర్‌పోర్టులో జెపాడ్ హోటల్


జెపాడ్ హోటల్‌లోని గదులు



జెపాడ్ హోటల్‌ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం జెపాడ్ హోటల్‌ను ప్రారంభించారు. విమానాల కోసం వేచి ఉండే సమయాల్లో స్మార్ట్ ధరల్లోనే సౌకర్యవంతమైన బసను ఇందులో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. అత్యవసరంగా లేదా ఇతర అవసరాల కోసం విమానాల కోసం వేచి ఉండే వారు స్టార్ హోటళ్ల ధరతో పోలిస్తే 50 శాతానికి పైగా తక్కువ ధరలో ఇక్కడ విశ్రాంతి పొందేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మహిళలు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి కూడా ఏర్పాట్లున్నాయని జెపాడ్ హోటల్స్ అధ్యక్షుడు జాగృత్ ఠిక్కర్ , డైరెక్టర్ హిరేన్ గాంధీలు తెలిపారు.

గుడిలో విగ్రహం మాయం


మణికొండ: చెరువు కట్టపై ఉన్న అమ్మవారి ఆలయంలో విగ్రహం మాయం అయ్యిందని, పక్కనే నిర్మాణం చేస్తున్న సంస్థ వారే తీసి ఉంటారని నార్సింగి వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ముష్కి చెరువు కట్ట పక్కన ఉన్న కట్టమైసమ్మ దేవాలయాన్ని తొలగించాలని పక్కనే నిర్మాణం చేపట్టిన ఓ రియల్ ఎస్టేట్ గ్రూపు యాజమాన్యం కోరిందని నార్సింగి వాసులు అన్నారు. అయితే తాము అంగీకరించక పోవటంతో సోమవారం సాయంత్రం అందులోని విగ్రహాన్ని తొలగించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువు కింద ముంపుకు గురయ్యే ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టడం కాకుండా అడ్డుగా ఉందని ఏకంగా ఆలయాన్ని లేకుండా చేయాలని చూస్తున్నారని, వారిపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తామన్నారు. వెంటనే వారిపై అధికారులు చర్యలు తీసుకుని దేవాలయాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నార్సింగి గ్రామస్థులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులపై నజర్

- మార్కెట్ కమిటీల పదవుల కోసం నాయకుల పైరవీలు
- పాత-కొత్తల కలయికతో కమిటీలు
- నాయకత్వానికి పేర్లతో ప్రతిపాదనలు
- ప్రకటించడమే తరువాయి


నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయం


నార్సింగి మార్కెట్ కమిటీ రేసులో ఉన్న వేణుగౌడ్


గుడిమల్కాపూర్ చైర్మన్ రేసులో ఉన్న తలారి మల్లేష్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల పందేరానికి సమయం వచ్చింది. ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు నామినేటెడ్ పదవులపై కన్నేసి తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గుడిమల్కాపూర్, నార్సింగి మార్కెట్ కమిటీల పాలక కమిటీలతోపాటు పలు దేవాలయాల కమిటీలలో స్థానం దక్కించుకునేందుకు ఎవరికి వారే పావులు కదుపుతున్నారు. ఆయా కమిటీల్లో ప్రధానమైన మార్కెట్ కమిటీల పాలక కమిటీల ఎంపిక ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో ముందు నుంచి ఉన్న వారితో పాటు కొత్తగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాలను ఇవ్వాలని అందరినీ కలుపుకుని వెలుతున్నట్టు తెలిసింది. అందులో భాగంగానే మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్, శంషాబాద్ మున్సిపాలిటీ, కాంగ్రెస్ మండల అధ్యక్షులను నామినేటెడ్ పదవులకు పేర్లను ఇవ్వాలని ఎమ్మెల్యే ఇటీవల కోరారు. దీంతో వారు పార్టీ కొరకు నిర్విరామంగా కృషి చేసిన వారితో పాటు వారి గత పదవులు, వారి స్థాయిని బట్టి పేర్లను ఇచ్చినట్టు తెలిసింది.

చైర్మన్‌లు వీరే?

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఐదు సంవత్సరాలుగా కన్నేసిన గండిపేట మండల మాజీ ఎంపీపీ తలారి మల్లేష్‌కు ఎమ్మెల్యే వర్గంలో భాగంగా పదవిని ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ఇక నార్సింగి మార్కెట్ కమిటీకి ఎప్పటి నుంచో కాంగ్రెస్ పార్టీలో ఉన్న నార్సింగికి చెందిన వేణుగౌడ్‌ను చైర్మన్‌గా అందరూ సమ్మతించినట్టు సమాచారం. అందులో భాగంగా వీరిద్దరికి పదవులు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన మత్స్య సహకార సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన కస్తూరి నరేందర్ ముదిరాజ్‌లు వారికి అనుకూలంగా లేఖలను ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో వారి పదవులు దాదాపు ఖరారు అయినట్టేనని, ఇప్పటికే నాయకత్వానికి వారి పేర్లు వెళ్లినట్టు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం జరుగుతుంది.

త్వరలో కమిటీలు...

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీలో మొత్తం 14 మంది పాలక కమిటీ ఉండగా.. అందులో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు పోను 12 మందికి అవకాశం దక్కనుంది. చైర్మన్ పదవిని రాజేంద్రనగర్ నియోజకవర్గానికి ఇవ్వనుండటంతో వైస్ చైర్మన్ పదవి చేవెళ్ల నియోజకవర్గానికి దక్కనుంది. మిగిలిన 12 మంది డైరెక్టర్ పదవుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి 4, చేవెళ్లకు 8గా కేటాయించినట్టు తెలుస్తోంది. అందులో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మున్సిపాలిటీకి ఒకటి చొప్పున మణికొండ, నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్‌లకు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మణికొండ నుంచి ఎమ్మెల్యే వర్గంలో భాగంగా మైనార్టీ నాయకుడు బషీర్, నార్సింగి నుంచి పాత కాంగ్రెస్‌లో భాగంగా మంచిరేవులకు చెందిన కురుమ అయిన డి.లక్ష్మణ్, బండ్లగూడ కార్పొరేషన్ నుంచి పాత కాంగ్రెస్ వర్గంగా హైదర్షాకోట్ నుంచి ఎస్సీ వర్గానికి చెందిన విష్ణుకు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఇక శంషాబాద్ నుంచి రెడ్డి వర్గానికి చెందిన వారికి కేటాయించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు. నార్సింగి మార్కెట్ కమిటీకి చైర్మన్‌గా నార్సింగికి చెందిన వేణుగౌడ్ ఖరారు కావటంతో వైస్ చైర్మన్ పదవి శంషాబాద్ మండలానికి వెళ్లనుంది. 10 మంది ఉండే డైరెక్టర్ పదవుల్లో రెండు మండలాలకు చెరి సగం కేటాయించే ఆలోచనలో పార్టీ నాయకులు, ఎమ్మెల్యే ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. త్వరలో వారి ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి రెండు మార్కెట్ కమిటీల పాలక కమిటీలను ప్రకటించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. మార్కెట్ కమిటీల ఎన్నిక ప్రక్రియ పూర్తి కాగానే నియోజకవర్గ పరిధిలోని అన్ని దేవాలయాల కమిటీలను ఎంపిక చేసే ప్రక్రియను చేపడతామని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తెలిపారు.



గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ కార్యాలయం

ఘనంగా 'అగ్రి' వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం


వేడుకలను ప్రారంభిస్తున్న అధికారులు


ఉత్తమ రైతులకు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి జగదీశ్వర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్య, జ్ఞానం అనేవి చాలా పదునైనా అస్త్రాలని వాటితోనే సర్వసవాళ్లని పరిష్కరించుకోవచ్చని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు నిరంతరం నేర్చుకోవడం పైనే దృష్టి పెట్టాలని అప్పుడే వికసిత భారత్ సాధ్యమవుతుందన్నారు. టెక్నాలజీలను ఉపయోగించుకొని తయారీ రంగంలో ముందుకు సాగాలని ఆయన సూచించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి విశ్వవిద్యాలయం ఇంచార్జి ఉపకులపతి రఘునందన్‌రావు మాట్లాడుతూ.. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైన 10 సంవత్సరాలలో బోధన, పరిశోధన, విస్తరణ రంగాలో పురోగతి సాధించిందని అన్నారు. ఉత్తమ రైతులకి, బోధన సిబ్బందికి పురస్కారాలు అందజేశారు.

బీఆర్‌ఎస్ నేతలపై దాడి సరికాదు

రాజేంద్రనగర్: ఖమ్మంలోని వరద భాధితులకు బీఆర్‌ఎస్ నేతలు, మాజీ మంత్రులు హరీష్‌రావు, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి, జగదీష్‌రెడ్డి తదితరులు నిత్యావసర సరుకులు పంచుతుండగా కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం దారుణమని, ఇది పిరికి పందల చర్య అని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సదాన శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. శివరాంపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ చర్యలను ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకు అక్కసుతో దాడి చేశారన్నారు. వరదలను అంచనా వేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

ఉపాధి కల్పనలో కేవీఐసీ పాత్ర కీలకం


ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీఐసీ చైర్మన్ మనోజ్‌కుమార్

శంషాబాద్ రూరల్: ఉపాధి కల్పనలో కేవీఐసీ పాత్ర కీలకమని, దానిని మరింత బలోపేతం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ మనోజ్‌కుమార్ అన్నారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా చేతివృత్తుల వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణ భారత్ ట్రస్టులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరులకు ఎలక్ట్రిక్ పోటర్ వీల్స్, ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా కేవీఐసీ తెలంగాణలో 17,662 కొత్త యూనిట్లను స్థాపించి 1,60,178 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. రూ.639.97 కోట్ల రాయితీ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల అమ్మకాలు గతంలో కంటే ఐదు రెట్లు పెరిగినట్లు తెలిపారు. రూ.1.55లక్షల కోట్లు టర్నోవర్‌తో 10.17 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించినట్లు వివరించారు.

ఫిరంగి నాలాపై 46 అక్రమ కట్టడాలు

శంషాబాద్: చెరువుల పరిరక్షణపై హైడ్రా పెంచిన దూకుడు త్వరలో ఫిరంగి నాలా ప్రక్షాళనవైపు కూడా వచ్చేందుకు ఆస్కారముందనేది ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. అక్రమాల చెరలో ఉన్న ఫిరంగి నాలా ప్రక్షాళనలపై ప్రభుత్వం ఇంకా తన విధానాన్ని స్పష్టం చేయకపోయినప్పటికి నాలా ఆక్రమణలపై మాత్రం సర్కారు తాజా నివేదికను అందుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.


సాతంరాయిలో ఫిరంగి నాలాకు అడ్డుగా ఏర్పాటు చేసిన ప్రహరి


మధురానగర్ కాలనీలో రోడ్డు పక్కనే ఉన్న ఫిరంగి నాలాలో ఉన్న కట్టడాలు

పట్టణంలో..

షాబాద్ మండలంల చందన్‌వెల్లిలో మొదలయ్యే ఫిరంగి నాలా శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాల మీదుగా పట్టణంలోని తొండుపల్లి,


ఫిరంగి నాలాను రోడ్డుకు ఉపయోగిస్తున్న పరిశ్రమలు

ఊటపల్లి, మధురానగర్, ఆదర్శనగర్, ఆర్‌బీనగర్, మిషన్ కంపౌండ్, సాతంరాయి నుంచి రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్ వైపు వెళ్తుంది. పట్టణంలో 2.8 కిలో మీటర్ల పొడవున ఫిరంగి నాలా ఉంటుంది. శంషాబాద్ పట్టణ పరిధిలో ఇటీవల రెవిన్యూ, మున్సిపాలిటీ విభాగాలు నిర్వహించే సర్వే నివేదిక 46 కట్టడాలు పూర్తిగా నాలాపై ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు కొన్ని నాలా బఫర్‌జోన్‌లో కూడా నిర్మాణం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రధానంగా మధురానగర్, మిషన్ కంపౌండ్ సాతంరాయి పారిశ్రామిక వాడతో పాటు సాతంరాయిలో ఇటీవలే నిర్మాణం చేసిన బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్‌ల పరిధిలో కూడా ఫిరంగి నాలాను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు గుర్తించారు. ఓ చోట ఫిరంగి నాలాను కాస్తా రోడ్డుగా మార్చేసి ఏకంగా అడ్డుగా గోడలను నిర్మాణం చేసి ఏకంగా గేట్లు కూడా బిగించారు. మధురానగర్‌లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఫిరంగి నాలాలోకి చొచ్చుకుని వచ్చిన కట్టడాలను కూడా తొలగించాలనే స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తాజా నివేదిక ఆధారంగా ఫిరంగి నాలా ప్రక్షాళనను సర్కారు తీవ్రంగా పరిగణిస్తే నాలాపై అక్రమ నిర్మాణాలు నెలమట్టం కావడం ఖాయంగానే కనిపిస్తోంది.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తం చేయాలి


సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, అధికారులు

మణికొండ: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, వైద్యశాఖల సిబ్బందితో మంగళవారం నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ ప్రజలకు వస్తున్న రోగాల పట్ల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీగా వర్షాలు కురుస్తుండటం, పలువురికి సీజనల్‌గా మలేరియా, డెంగీ, కలరా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా చెత్త కనిపించకుండా, రోడ్లపై నీరు నిలువకుండా మున్సిపల్ సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఎక్కడ చెత్త కనిపించినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే రోగాల భారిన పడి వారికి ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు ఇంటింటికి వెళ్లి వారికి అవసరమైన మందులను సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ యోగేష్, శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా గణేష్‌నగర్ పాఠశాల


విద్యార్థులతో మాణిక్యంరెడ్డి



- పాఠశాలను అద్భుతంగా తీర్చి దిద్దిన ఉపాధ్యాయుడు
- పాఠశాలను తన సొంత ఇంటిలాగా చూసుకుంటున్న వ్యక్తి
- రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు
- పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న ఉపాధ్యాయుడు నావారు మాణిక్యంరెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను బోధిస్తూ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన జీవశాస్త్రం ఉపాధ్యాయుడు నావారు మాణిక్యంరెడ్డి. పాఠశాలకు వచ్చిన సమయంలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకుండా ఉండేవి. ప్రతిదినం తన ఆలోచనతో తోటి ఉపాధ్యాయులను కలుపుకొని, స్థానిక నాయకులతో కలిసి పాఠశాలలో అనేక సౌకర్యాలు కల్పించారు. ప్రైవేట్ సంస్థలతో పాఠశాలలో సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ క్లాసులతో పాటు డిజిటల్ క్లాసులు నిర్వహించే విధంగా పాఠశాలను అభివృద్ధి పరిచారు. ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటు పాఠశాలగా మార్చేశాడు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు జీతాలు వస్తే చాలు అనుకునే వారు ఎక్కువ, ఈ పాఠశాలలో జీతాలు తీసుకుంటూ పాఠశాలకు, విద్యార్థులకు అవసరమయ్యే కొన్ని సేవా కార్యక్రమాలకు సొంత నిధులను సమకుర్చుకొని పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని స్థానికులు అభినందిస్తున్నారు. పాఠశాల సెలువులు వస్తే అందరు ఉపాధ్యాయులు తమ కుటుంబాలతో గడుపుతారు. కానీ మాణిక్యం మాస్టారు మాత్రం వారంలో మూడు రోజులు పాఠశాలకు వచ్చి స్థానికులుచే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షకుడిగా ఉంటాడు. విద్యార్థులకు అవసరమయ్యే అనేక రకాల పరికరాలను సమకుర్చడాని స్థానికులను అడిగి సమకూరుస్తారు.

వివిధ ప్రైవేట్ సంస్థల పరికరాలతో..

స్టేమ్ ల్యాబ్ (సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమాటిక్స్)ను విద్యార్థుల కోసం సైన్స్‌వేర్ సాఫ్ట్ వేర్ సంస్థ వారు విద్యార్థుల కోసం 10 లక్షలు వెచ్చించారు. ప్రతి రోజు పాఠశాల విద్యార్థులు సైన్స్ ల్యాబ్‌లో అముల్యమైన విద్యాబోధనను నేర్చుకుంటున్నారు.

6 సంవత్సరాలలో ప్రైవేట్ పాఠశాలగా..

మైక్రోన్ సంస్థవారు కంప్యూటర్ శిక్షణ కోసం సుమారు 14 లక్షలు వెచ్చించారు. సేవ్ ద చిల్డెన్ సంస్థవారు విద్యార్థుల కోసం బాత్ రూమ్‌లను కట్టించారు. లర్నింగ్ లింగ్స్ వారు 65 నాణ్యమైన బెంచీలను అందించారు. స్థానిక గణేష్ పొదుపు సంఘం సభ్యులు పాఠశాల కోసం బోర్ వెల్ అందించారు. సీసీ కెమెరాలను అందించారు. పాఠశాల చుట్టూ కంపౌండ్ వాల్‌ను ఏర్పాటు చేయించారు. ఇంటిగ్రేటెడ్ ఫ్లాట్ ప్యానెల్ డిజిటల్ బోర్డును అమర్చి విద్యార్థులకు డిజిటల్ క్లాసులు తీసుకుంటున్నారు. ఇలా అనేకమైన అభివృద్ధి చేస్తూన్నారు. తాను వచ్చిన 6 సంవత్సరాలలో పాఠశాలను ప్రైవేట్ పాఠశాలగా మార్చేశారు. నాణ్యమైన విద్యాతో పాటు మంచి ఉత్తీర్ణత శాతం తీసుకువచ్చారు. 2024వ సంవత్సరం 88 శాతం ఉత్తీర్ణత వచ్చే విధంగా కృషి చేశారు. రెండు మార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నాడు. 2016లో మండల స్థాయిలో, 2022లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఇలాంటి మంచి మాస్టారులు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉంటే విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాలలో ఉన్నత శిఖరాలను అదిరోహిస్తారని స్థానికులు వాపోతున్నారు.



పాఠశాలలో సైన్స్ ల్యాబ్



కంప్యూటర్ పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు


మైక్రో సిస్టంతో విద్యార్థులు

ఉచిత వైద్య శిబిరం


వైద్య సేవలు పొందుతున్న ఉపకమిషనర్ రవి కుమార్


పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న డీసీ

రాజేంద్రనగర్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఉపకమిషనర్ రవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని పని చేస్తున్న కార్మికులందరికి ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు వారికి మందులను అందజేశారు.

ఈసీ వాగులో తగ్గిన వరద ప్రవాహం

శంషాబాద్ రూరల్: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మండల పరిధిలోని ఈసీవాగులో వరద ఉదృతి తగ్గిపోయింది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ఈసీవాగు పొంగిపొర్లి సమీప పంటపొలాలను ముంచెత్తింది. ప్రస్తుతం ఈసీ వాగు గుండా హిమాయత్‌సాగర్‌లోకి వరద ప్రవాహం తగ్గుతూ వస్తుంది. మరో వైపు కాచారం, ననాజీపూర్ పరిసరాల నుంచి ఉన్న ఎంటేరువాగులో సైతం వరద అంతంతమాత్రంగానే ఉంది. ఈ రెండు వాగుల వరద హిమాయత్‌సాగర్‌కు చేరుతుంది.